ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

ఆదివారం 23 నవంబరు 2025



5

శ్రీవారాహి అమ్మవారి దేవాలయం నిర్మించడం అభినందనీయం

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

6 భక్తులు మెచ్చేలా వైకుంఠపురం ఆలయాన్ని తీర్చిదిద్దుతాం

● మంత్రి నాదెండ్ల మనోహర్



గుంటూరు : గవర్నమెంట్ హాస్పటల్‌లో నేలపైనే నిద్రిస్తున్న రోగి సహాయకులు

నిస్సహాయకులుగా

ప్రభుత్వ వైద్యశాలల్లో రోగి సహాయకులకు తప్పని బాధలు

- కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్న వైనం
- రాత్రిళ్లు పరిస్థితి మరింత దయనీయం
- ఆసుపత్రుల్లో ఎక్కడా కనిపించని వెయిటింగ్ హాల్స్
- నేలపైనే భోజనం, వార్డులో రోగి పక్కన కిందనే పడక
- తిరగని ఫ్యాన్లు, దోమల బెడద.. తప్పని పాట్లు

ఆంధ్రజ్యోతి విజిట్‌లో కళ్లకు కట్టిన సహాయకుల నిస్సహాయత

ఉన్న రోగానికి వైద్యం కోసం వెళ్తే.. కొత్త రోగం వచ్చిందని.. గతంలో సర్కార్ దావఖానాలకు వెళ్లిన రోగులు, వారి వెంట వెళ్లిన సహాయకులు అక్కడి వసతులు చూసి.. చెప్పుకునే వారు. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. వైద్యా నికి ప్రభుత్వాలు పెద్ద పీట వేస్తున్నాయి. ఆసుపత్రుల్లో వసతు లకు, వైద్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులూ బాగానే వస్తున్నాయి. వైద్యులు, సిబ్బంది కూడా సరిపడానే ఉంటు న్నారు. దీంతో ప్రభుత్వాసుపత్రులకు వచ్చే పేద, మధ్య తరగతి రోగుల సంఖ్య కూడా పెరిగింది. అయితే వీరి వెంట వచ్చే సహాయకుల బాధలు మాత్రం ఇక్కడ వర్ణనాతీతంగా ఉన్నాయి. అత్యవసర చికిత్సల సమయంలో రోగులు, ప్రసవానికి వచ్చే గర్భిణుల వెంట బంధువులు, కుటుంబ సభ్యులు వస్తుంటారు. పరిస్థితిని బట్టి.. రోగితో పాటు వార్డుల్లో వారు కూడా కొన్ని రోజులు ఉండాల్సి వస్తుంది. ఈ సమయంలో ఆసుపత్రుల్లో ఎలాంటి వసతులు లేక వారు ఇబ్బందులు పడుతున్నారు. వెయింట్ హాల్స్ ఏ ఆసుపత్రిలోనూ కనిపించడం లేదు.

వార్డుల్లో ఇన్‌పేషంట్ వద్ద ఒకరిద్దరిని మాత్రమే సహాయంగా ఆసు పత్రి సిబ్బంది అనుమతిస్తున్నారు. వీరు రాత్రుళ్లు.. అక్కడే ఖాళీగా ఉండే రోగి బెడ్‌పైన, లేదా రోగి బెడ్ కింద నేలపై తమతో తెచ్చుకున్న చాపవేసుకుని పడుకుంటున్నారు. వారు భోజనం చేసేందుకు కనీస ఏర్పాట్లు కూడా లేవు. దీంతో నేలపై కూర్చుని భోజనం చేస్తున్నారు. కొన్ని ఆసుపత్రుల వరండాల్లో కనీసం ఫ్యాన్లు కూడా లేక దోమలతో కుట్టించుకుంటూ.. తమ వారి కోసం భరిస్తూ వేచి ఉంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జీజీహెచ్, ఏరియా వైద్యశాలలు, వంద పడకల ఆసుపత్రులను ఆంధ్రజ్యోతి పరిశీలించినప్పుడు.. రోగుల సహాయకుల నిస్సహా యత స్పష్టంగా కనిపించింది. తమ వాళ్ల వైద్యం కోసం వచ్చి.. తా ము రోగాల బారిన పడేలా ఉన్నామని కొందరు చెబుతు న్నారు. ప్రభుత్వం స్పందించి హాస్పటల్స్‌లో వేచి ఉండేందుకు కనీస వసతులు కల్పించాలని వారు కోరుతున్నారు.

- గుంటూరు, ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



గుంటూరు : గవర్నమెంట్ హాస్పటల్‌లో నేలపైనే నిద్రిస్తున్న రోగి సహాయకులు

6



నరసరావుపేట ఏరియా వైద్యశాలలో చలికి సర్దుకు పోతున్న రోగి, బంధువు



వేమూరు : కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగి పక్కనే కూర్చున్న సహాయకురాలు



చీరాల : గర్భిణుల వార్డు వద్ద దోమల్లో నేలపై పడుకున్న అటెండర్స్



రేపల్లె : ప్రభుత్వ వైద్యశాలలో వైద్యసేవలు పొందుతున్న రోగులు

పారదర్శకంగా

ధాన్యం కొనుగోలు

● కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బంది లేకుండా అత్యంత పారదర్శకతతో కొనుగోలు ప్రక్రియ ప్రారంభించామని కలెక్టర్ డాక్టర్ వి. వినోద్‌కుమార్ తెలిపారు. ధాన్యం కొనుగోలుపై శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మద్దతు ధరతో ధాన్యం సేకరించడానికి రంగం సిద్ధం చేశామన్నారు. గ్రేడ్-ఏ క్వింటాల్ ధాన్యం రూ.2,389, సాధారణ రకం రూ.2,369గా ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. గతేడాది కన్నా.. క్వింటాల్‌కు రూ.69 ధర పెరిగిందన్నారు. జిల్లాలో 2,91,109 ఎకరాల్లో 1,66,553 మంది రైతులు వరి సాగు చేశారని చెప్పారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 2 లక్షల మెట్రిక్ ధాన్యం సేకరణకు ప్రభుత్వం అనుమతులిచ్చిందన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా ఆన్‌లైన్ ద్వారా మిల్లులు, రైతులను అనుసంధానిస్తున్నట్లు చెప్పారు. 117 కొనుగోలు కేంద్రాలను ఆర్‌ఎస్కేలలో ఇప్పటికే ప్రారంభించామని కలెక్టర్ వెల్లడించారు. బంగాళాఖాతంలో అల్ప పీడనం నేపథ్యంలో సోమవారం వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున.. ధాన్యం పాడవ్వకుండా టార్పాలిన్ పట్టాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రైస్ మిల్లుల నుంచి బ్యాంక్ పూచీకత్తుతో ధాన్యం కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ భావన వశిష్ఠ

స్లాట్ బుకింగ్ ఇలా..

ఆర్‌ఎస్కేల్లో పేర్లు నమోదు కాగానే.. రైతుకు టోకెన్ ఇస్తారని జేసీ భావన వశిష్ఠ తెలిపారు. ఏ తేదీన ధాన్యం తీసుకురావాలో.. రైతు ఫోన్‌కు సమాచారం వెళ్తుందన్నారు. 73373 59375 వాట్సాప్ నంబరుకు హాయ్ మెస్సేజ్ చేస్తే.. స్లాట్ బుక్ చేస్తారన్నారు. 17 శాతం కంటే తక్కువ తేమ ఉండేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏ ప్రాంతంలోనైనా ధాన్యం అమ్ముకోవచ్చని జేసీ చెప్పారు. రవాణా చార్జీలు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ప్రతి వాహనానికి జీపీఎస్ తప్పనిసరన్నారు. సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబరు 1967, కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 77028 06804 నంబరుకు అందుబాటులో ఉంటాయన్నారు.

తీర్మానాలతో సరి..

ఫలితాలపై సమీక్షేది

- మొక్కుబడి తంతుగా జిల్లా అభివృద్ధి మండలి సమావేశాలు
- కీలకమైన ఏటీఆర్ విషయంలో నిర్లక్ష్యం
- డీఆర్సీకి ముందు హడావిడిగా రిపోర్టులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి):

డీఆర్సీ(జిల్లా అభివృద్ధి మండలి) సమావేశం అనేది అత్యంత కీలకమైంది. ఆరు నెలలకోసారి ఇన్‌చార్జి మంత్రి సారథ్యంలో జరిగే డీఆర్సీనే జిల్లా అభివృద్ధి పనుల విషయంలో దిశానిర్దేశం చేయనుంది. ఇంతటి కీలకమైన డీఆర్సీకి ఏటీఆర్ (యాక్షన్ టేకెన్ రిపోర్టు)అనేది ఆ సమావేశాల పనితీరుకు అద్దం పట్టేదిగా ఉంటుంది. డీఆర్సీలో లేవనెత్తిన, చర్చ కు వచ్చిన పలు అంశాలు, సమస్యలు పరిష్కారం అయ్యాయా లేదా అనే విషయాలను ఏటీఆర్‌లో సద రు విభాగాలు పొందుపరిచి తర్వాత డీఆర్సీ సమావేశాల నాటికి ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉంచాలి. కానీ ఇదంతా కూడా మొక్కుబడి తంతుగా జరుగుతుందే.. ఎక్కడా చిత్తశుద్ధి కనబడడం లేదు. ఈ ప్రభుత్వంలో ఇప్పటి వరకు మూడు డీఆర్సీలు జరిగాయి. మరో వారం రోజుల్లో నాల్గోది జరగనుంది. ఆయా విభాగాల నుంచి ఏటీఆర్‌లను ప్రణాళికా విభాగం ఫైలింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ,తొలి రెండు డీఆర్సీల ఏటీఆర్‌ల రికార్డులే లేవని సదరు విభాగం చెప్పడం, డీఆర్సీ సమావేశాలపై ఉన్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.



గతేడాది నవంబరులో నిర్వహించిన తొలి డీఆర్సీ సమావేశం (ఫైల్ ఫొటో)

ఏటీఆర్ లేదట...

డీఆర్సీకి ముందు ఏటీఆర్‌ను ఆయా విభాగాలు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మొత్తాన్ని ప్రణాళికా విభాగం సమన్వయం చేసుకోవాలి. తొలి రెండు డీఆర్సీలకు సంబంధించిన ఏటీఆర్‌లే లేవని సదరు విభాగం వద్ద నుంచి సమాదానం రావడం విస్తుగొలిపేదిలా ఉంది. ఈ వారంలోనే నాలుగో డీఆర్సీ జరగనుంది. గత సమావేశాల్లో చర్చకు వచ్చిన అంశాలపై ఏటీఆర్‌ను త్వరలో జరగబోయే సమీక్షల్లో సమర్పించాల్సి ఉంటుంది.

మధ్యలో సమీక్షలేవీ..

డీఆర్సీ అనంతరం అందులో లేవనెత్తిన సమస్యల పరిష్కార పురోగతిపై ఆయా విభాగాల అధికారులతో సమీక్ష జరిపితే మెరుగైన ఫలితాలు ఉంటాయి. కానీ దీనికి ఆస్కారం లేకుండా తదుపరి డీఆర్సీ తేదీ ప్రకటించగానే హడావిడిగా ఏటీఆర్‌లు తయారు చేసి ప్రజాప్రతినిధులకు చదివి వినిపిస్తున్నారు. మే 21న మూడో డీఆర్సీ జరిగింది. ఈ సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యల పరిష్కారానికి ఎలాంటి కసరత్తు జరిగిందనేదానిపై.. ఇప్పటి వరకు సమీక్ష జరగలేదు.

చర్చించడం....వదిలేయడం

బర్లీ పొగాకు సాగు విస్తీర్ణంపై గత డీఆర్సీల్లో విస్తృతంగా చర్చ జరిగింది. కొనుగోలుకు కంపెనీలు ముందుకొస్తాయని ఏటీఆర్‌లో చెప్పారు. క్షేత్రస్థాయిలో జరిగిందేంటో అందరికీ తెలుసు. క్షేత్రస్థాయి వాస్తవాలతో సంబంధం లేకుండా డీఆర్సీలో చర్చించి వదిలేయడం, తర్వాత సమావేశాల నాటికి మొక్కుబడిగా ఏటీఆర్‌లు సమర్పించడం ఇదీ జరుగుతున్న తంతు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఆక్వా సాగుపై గత డీఆర్సీల్లో చర్చకు వచ్చింది. రెవెన్యూ మంత్రి అనగాని దీనిపై స్పందించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఓ విధంగా ఏటీఆర్ సమర్పించమన్నట్లే. ఇది కూడా బుట్టదాఖలే. కాలువ పూడికతీత పనుల్లో అంకెల వల్లెవేతకే యంత్రాంగం పరిమితమైంది. నిధుల కొరత ఉందనే అంశాన్ని కూడా ఏటీఆర్‌లో పొందుపరచలేని నిస్తేజంలో ఆయా విభాగాలు ఉన్నాయి. ఈ నిర్లక్ష్యం ఫలితమే మొన్నటి మొంథా తుఫాన్ ధాటికి కాలువలు ఉప్పొంగి పంటచేలను కబళించి రైతులకు నష్టాన్ని మరింతగా మిగిల్చాయి. ఇవి ఉదాహరణలు మాత్రమే. దాదాపుగా డీఆర్సీని ఓ మొక్కుబడి సమీక్షగా మార్చారు. నేతల మెప్పు కోసం అన్ని పనులు చేసినట్లు ఏటీఆర్‌లు ఇవ్వడం తప్పితే అందులో 50 శాతం కూడా నిజాలు ఉండడం లేదు. డీఆర్సీకి గుండెకాయ వంటి ఏటీఆర్ ఫైలింగ్ లేదనే జవాబు వ్యవస్థల వద్దనుంచి రావడమే వీటన్నింటికి నిరూపణగా కనబడుతోంది.

ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా సూర్యలంక

● ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బాలాజి

బాపట్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా సూర్యలంకను అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజి తెలిపారు. సూర్యలంక సముద్ర తీరంలోని హరితా బీచ్ రిసార్ట్స్‌ను శనివారం ఆయన సందర్శించారు. వసతి సదుపాయాలు, పర్యాటకులకు అందిస్తున్న సేవలను అధికారులు ఆయనకు వివరించారు. సౌకర్యాల విస్తరణ, భద్రత మెరుగుదల, పర్యాటకుల ఆకర్షణకు ప్రత్యేక ప్యాకేజీల రూపకల్పనపై దృష్టి పెట్టాలని చైర్మన్ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ముందుగా తీరానికి వస్తున్న కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజి కారును టోల్‌గేట్ వద్ద ఆపివేశారు. టోల్ చార్జి చెల్లించాలని అడగటంతో ఆయన అసంతృప్తికి గురయ్యారు. దీనిపై కలెక్టర్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పంచాయతీ సిబ్బంది టోల్ వసూలుపై వివరాలు ఇవ్వాలని అధికారులను ఆయన కోరారు.



సూర్యలంక హరితాబీచ్ రిసార్ట్స్‌లో పర్యటిస్తున్న ఏపీటూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజి

ఆయిల్ పామ్‌తో ఆర్థిక భరోసా

● మొక్కలు నాటిన ఎమ్మెల్యే ఏలూరి ● ఫ్యాక్టరీ నిర్మాణానికి వినతి

మార్టూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఆయిల్ పామ్ సాగు లాభదాయకంగా ఉంటుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివ రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని కోనంకి, ఇసుక దర్శి గ్రామాల మధ్య ఉప్పలపాటి చక్రపాణికి చెందిన వ్యవసాయ పొలంలో ఉద్యానశాఖ సహకారంతో ఆయిల్ పామ్ మొక్కలను అధికారులు, నాయకులు, రైతులతో కలిసి ఎమ్మెల్యే సాంబశివరావు నాటారు. పర్చూరు నియోజకవర్గ చరిత్రలోనే తొలిసారిగా ఆ యిల్ పామ్ పంట సాగుకు రైతులతో కలిసి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా ఉద్యానశాఖాధికారి ఖలీల్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ మార్టూరు ప్రాంతం లో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలని కంపెనీ ప్రతినిధులను కోరారు. తద్వారా ఈ ప్రాంతంలో పంట సాగు విస్తీర్ణం పెరుగుతుందన్నారు. రైతులకు స్థిర ఆదాయం పెరగడానికి దోహదపడుతుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రత్యేకంగా ఉచిత మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్‌పై భారీ సబ్సిడీలు, కొనుగోలు హామీ వంటి ప్రయోజనాలను కల్పిస్తోందన్నారు. ప్రభుత్వం ఉచితంగా మొక్కలను సరఫరా చేస్తుందన్నారు. మార్టూరు మండల రైతులు పంట సాగుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. ఉద్యానశాఖ అధికారి హనుమంత నాయక్ మాట్లాడుతూ పామాయిల్‌కు మార్కెట్‌లో భారీ డిమాండు ఉందన్నారు. మండలంలో ఇప్పటికి 150 ఎకరాల్లో రైతులు పంట సాగుపై ఆసక్తిగా ఉన్నారన్నారు. పంట సాగు చేసే రైతులకు ఉద్యానశాఖ సహకారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ లవన్న, తహసీల్దారు టి.ప్రశాంతి, అజంతా సోయ లిమిటెడ్ మేనేజరు బాషా, వ్యవసాయ అధికారి లావణ్య, పర్చూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుంజి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్ పామ్ మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే ఏలూరితో అధికారులు,నాయకులు

విద్యుత్ బిల్లులపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చీరాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): యానాది కాలనీ వాసుల విద్యుత్ బిల్లుల సమస్యలు పరిష్క రించనున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. కొంత కాలంగా చీరాల మునిసిపాలిటీ 33వ వార్డు లోని వడ్డే పుల్లయ్య యానాది కాలనీ వాసులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలు కావడం లేదు. దీంతో వారి సమస్యలు వెలుగులోకి తెస్తూ.. ఆంధ్రజ్యోతిలో గుండె గుబిల్లు శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఏఈ శంకర్ ఇతర సిబ్బందితో శనివారం కాలనీలో విచారణ చేపట్టారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా డిమాండ్ నోటీసు లతో పాటు పథకాలకు అవసరమైన ఆధారాలు సేకరించారు. వెంటనే సమస్యను పరిష్కరిస్తామని గ్రామస్థులకు చెప్పడంతో వారు హర్షం వ్యక్తం చేశారు.



విద్యుత్ బిల్లులపై విచారణ చేపట్టిన అధికారులు

నిస్సహాయకులుగా

- ప్రభుత్వ వైద్యశాలల్లో రోగి సహాయకులకు తప్పని బాధలు
- కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నవైనం
- రాత్రిళ్లు పరిస్థితి మరింత దయనీయం
- ఆంధ్రజ్యోతి విజిట్‌లో.. సహాయకుల నిస్సహాయత


రేపల్లె ఆసుపత్రిలో రోగులు

రోగి బెడ్డుపైనే నిద్ర

వేమూరు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగి సహాయకులు బస చేసేందుకు ప్రత్యేకమైన ఏర్పాట్లు లేవు. రోగి పడక పక్కనే.. ఉన్న ఖాళీ బెడ్డుపైనే సహాయకులు పడుకుంటున్నారు. ఖాళీ లేని పక్షంలో నేలపైనే తమతో తెచ్చుకున్న చాప వేసుకుని నిద్రిస్తున్నారు. ప్రభుత్వ పరంగా భోజన వసతి లేని కారణంగా.. హోటల్ లేదా ఇంటి నుంచి ఆహారం తెచ్చుకుంటున్నారు.

చీరాల: స్థానిక పెద్దాసుపత్రిలో 100 పడకలున్నాయి. మరో 50 పడకలతో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులు జరుగుతు న్నాయి. చీరాల, వేటపాలెం, పర్చూరు, మార్టూరు తదితర మండలాల నుంచి నిత్యం అత్యవసర, సాధారణ చికిత్సల కోసం రోగులు వస్తుంటారు. ప్రతీరోజు 350 నుంచి 500 వరకు ఓపీలు ఉంటాయి. అయితే గర్భిణులు, దీర్ఘకాలిక, ప్రమాదాలకు గురైన

డీఎంహెచ్‌ఓ కార్యాలయంగా..

బాపట్ల: బాపట్ల పట్టణంలోని ఏరియా వైద్యశాలలో రోగుల సహాయకులు ఉండేందుకు షెల్టర్ లేదు. దీంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. పేరుకు వంద పడకల ఆసుపత్రిలో.. రోగులతో వచ్చేవారు మాత్రం పడిగాపులు పడాల్సిందే. రాత్రిళ్లు రోగి వద్ద ఒక సహాయకుడిని మాత్రమే ఉంచుతారు. ఎక్కువమంది వస్తే ఆపరేషన్ థియేటర్ ఎదుట వరండాలో, ఓపీ విభాగం దగ్గర నేల పైన, ఆసుపత్రి ఎదురు రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లలపైన కూర్చొని ఉండాల్సిందే. గతంలో రోగుల సహాయకులకు ఆసుపత్రి ప్రాంగణంలో వెయిటింగ్ హాలు నిర్మించారు. బాపపట్ల జిల్లా అయిన తర్వాత దానిని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంగా మార్చేశారు.

తప్పని అవసస్థలు..

రోగులకు వైద్యం అంతంత మాత్రంగా ఉంది. రోగుల సహాయకులకు ఇక్కడ వసతి దయనీయంగా ఉంది. రాత్రిళ్లు కాసేపైనా.. పడుకునేందుకు అనువైన స్థలం లేదు. ఫ్యాన్ల సౌకర్యం కూడా లేదు. దీంతో దోమలతో కుట్టించుకుంటూనే వారు వేచి ఉంటున్నారు. అంతేకాకుండా.. ఆంధ్రజ్యోతి విజిట్‌లో హాస్పిటల్ గోడ పక్కన కాలం చెల్లిన మందులు ఇష్టారీతిగా పడేసి ఉండడం కనిపించింది.

వరండాలో కిందే భోజనం

సత్తెనపల్లి: సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో రోగుల సహాయకుల కోసం ప్రత్యేకంగా వెయిటింగ్ హాల్ లేదు. వారు భోజనం చేసేందుకు కనీసం బల్లలు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో వరండాలోనే భోజనం చేస్తున్నారు. సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, బెల్లంకొండ, అచ్చంపేట, క్రోసూరు మండలాల నుంచి వైద్యం కోసం నిత్యం రోగులు, వారి సహాయకులు వస్తుంటారు. మెడికల్, సర్జికల్, చిన్న పిల్లలు, గర్భిణుల వార్డుల్లో నిత్యం 80 మందికి తగ్గకుండా ఇన్ పేషెంట్లు ఉంటారు. వీరికి సహాయకులుగా ఒకరిద్దరు వస్తుంటారు. వీరు వేచి ఉండే ప్రదేశాల్లో కనీసం ఫ్యాన్‌లు కూడా లేకపోవడంతో.. ఆస్పత్రి హెడ్ నర్సు బంగారు పాప దాతల సహకారంతో రెండు ఫ్యాన్‌లు కూడా ఏర్పాటు చేయించారు.

పేరుకే పెద్దాస్పత్రి.. నిలువ నీడ కరువు

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రఖ్యాతి గాంచిన గుంటూరు సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి)లో రోగుల వెంట వచ్చే సహాయకులకు నిలువ నీడ కరువైంది. జీజీహెచ్‌లో తగిన వసతి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత చలికి గజగజ వణికిస్తున్న చలిలో దోమకాటులకు గురవుతూ.. ఆస్పత్రి ఆవరణలో ఆరుబయట ఏర్పాటు చేసిన బల్లలపై నడుం వాలుస్తున్నారు. కొందరైతే నడకదారుల్లో కిందనే ఊడ్చుకుని నిద్రకు ఉపక్రమిస్తున్నారు. అయినప్పటికీ వాళ్లపై దయ చూపకుండా సెక్యూరిటీ గార్డులు చీత్కరించుకొంటున్నారు. జీజీహెచ్‌కు ఒక్క ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచే కాకుండా ప్రకాశం, కృష్ణ జిల్లాల నుంచి కూడా రోగులు చికిత్స కోసం వస్తుంటారు. క్రిటికల్ కేసులను ప్రైవేటు ఆస్పత్రుల్లో చేర్చుకోరు. దాంతో వారికి జీజీహెచ్ తప్పా మరో ప్రత్యామ్నాయం లేదు. దాంతో నిత్యం రాత్రి వేళ వందల సంఖ్యలో రోగుల సహాయకులు ఆస్పత్రికి వస్తున్నారు. వార్డులలో రోగుల వెంట ఒక సహాయకుడిని మించి సిబ్బంది ఉండనీయడం లేదు. ప్రభుత్వం ఒక డైనింగ్ హాల్‌ని జీజీహెచ్‌లో నిర్మించింది. గుంటూరు మాజీ ఎంపీ గల్లా జయదేవ్ జీజీహెచ్‌లో రోగుల సహాయకుల విశ్రాంత భవనం కోసం రూ.2 కోట్ల నిధులు అందజేశారు. కోటి రూపాయలు తన ఎంపీ లాడ్స్ నుంచి నుంచి, మరో రూ.కోటి తన వ్యక్తిగత ట్రస్టు నుంచి అందజేశారు. జీజీహెచ్ ఆవరణలో రెండు అంతస్తులతో రోగి సహాయకుల విశ్రాంతి భవన నిర్మాణం చేపట్టారు. 80 శాతం నిర్మాణ పనుల పూర్తయ్యాయి. ఇటీవల ఆ భవనంలో జిల్లా క్షయ నియంత్రణ కార్యాలయం సిబ్బందికి కేటాయించారు.

పౌరుషంతో పోరాడిన కోళ్లు

- వీరారాధన ఉత్సవాల్లో నాలుగోరోజు కోడిపోరు
- మాచర్ల కోడితో ఎమ్మెల్యే జూలకంటి
- గురజాల కోడితో కొమ్మాలపాటి

కారంపూడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పల్నాడు వీరారాధన ఉత్సవాల్లో నాలుగో రోజైన శనివారం కోడి పోరును విజయవంతంగా నిర్వహించారు. తొలుత పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారును మేళతాళాలతో ఇంటి నుంచి ఊరేగింపుగా కోడిపోరు ప్రదేశానికి తీసుకొచ్చారు. నాయకురాలు నాగమ్మ వేషంను యాదవ వీరాచార వంతుడు కట్టాడు. బ్రహ్మనాయుడుగా పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు కూర్చున్నారు. మాచర్ల వైపు బ్రహ్మనాయుడు తరుపున మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడి, గురజాల వైపు నాయకురాలు నాగమ్మ తరుపున టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ నిలిచారు. మాచర్ల కోడి చిట్టిమల్లును ఎమ్మెల్యే జూలకంటి అందుకున్నారు. గురజాల కోడి శివంగి డేగను కొమ్మాలపాటి చేతబట్టారు. అనంతరం కోళ్లను పందేనికి ఉసిగొల్పారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు ఖడ్గం, డాల్‌ను చేతబూనారు. టీడీపీ యువ నేత జూలకంటి గౌతమ్‌రెడ్డి, సినీ నటుడు బండ్ల గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

కుట్రపన్ని..అరణ్యవాసానికి పంపి..

ఆనాడు మాచర్ల రాజ్యాన్ని కైవసం చేసుకోవడానికి నాగమ్మ కుట్ర పన్ని కోడి పందేనికి బ్రహ్మనాయుడును ఉసిగొల్పుతుంది. జూద వ్యసనుడైన బ్రహ్మనాయుడు కోడి అందుకు సిద్ధమవుతాడు. తొలి, మలి పందెంలో బ్రహ్మనాయుడు కోడి చిట్టిమల్లు గెలువగా, ముచ్చటగా మూడో పందెం వేద్దామని నాగమ్మ పట్టుబడుతుంది. ఈ పందెంలో ఓడిన వారు 14 ఏళ్లు రాజ్యం వదలి అరణ్యవాసం చేయాలని నిబంధన పెడుతుంది. నాగమ్మ నల్గొండ జిల్లా నుంచి తెప్పించిన శివంగి డేగ పందెంలో చిట్టిమల్లు దాటికి తట్టుకోలేకపోతోంది. అప్పటికే గంగవరం కట్టుబోతుల వారిని పిలిపించిన నాగమ్మ మంత్రాక్షితలు చిట్టిమల్లుపై చల్లమని ఆదేశిస్తోంది. బ్రహ్మనాయుడు చూపు కోడిపై ఉన్నంత వరకు మంత్రాక్షితలు పనిచేయవని కట్టుబోతుల వారు చెబుతారు. ఆయన చూపు మరల్చడానికి నాగమ్మ తన చీరపై కుంకుడు బురుజు పోసుకొని బహిష్టయినట్లు నాటకం ఆడుతుంది. దీక్షా పరుడైన బ్రహ్మనాయుడు బహిష్టయిన వారి మొహం చూడకూడదని మొహం తిప్పుకుంటాడు. కట్టుబోతుల వారు చిట్టిమల్లుపై మంత్రాక్షితలు చల్లుతారు. దీంతో చిట్టిమల్లు నేలకొరిగిపోతుంది. నాగమ్మ కోడి గెలిచినట్లు ప్రకటిస్తారు. అరణ్య వాసానికి వెళ్లాలని నిర్ణయిస్తారు. ఈ పోరు తిలకించడానికి వచ్చిన ప్రజలు ఆసనాలుగా రాళ్లు వేసుకోగా.. అవి ఇప్పటికీ రెంటచింతల మండలం పాలువాయి వద్ద గుట్టలుగా ఉన్నాయి. ఈ గాథను వీరావిద్యావంతులు గానం చేశారు.


కోడి పుంజులతో ఎమ్మెల్యే జూలకంటి, కొమ్మాలపాటి

కొణతాల ఊరేగింపు

వివిధ జిల్లాల నుంచి వచ్చిన వీరాచారవంతుల పూర్వీకుల ఆయుధాలకు గంగధార మడుగులో స్నానమాచరింపజేశారు. వాటిని అలంకరించి చెన్నకేశవ, అంకాళమ్మ ఆలయాల్లో తీర్థం స్వీకరించి గ్రామోత్సవం జరిపారు. బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద కత్తి సేవ చేశారు. పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ అయ్యవారుతో కోడిపోరు ఘటనా స్థలానికి వీరాచారవంతులు తమ కొణతములతో వచ్చి నిలబడ్డారు. వీరాచార పీఠం నిర్వాహకుడు బొగ్గరం విజయ్‌కుమార్ అయ్యవారు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, కన్వీనర్ బూసా రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.


కోడి పందేల ఉత్సవంలో సినీ నటుడు గణేష్


కోడిపోరును గానం చేస్తున్న వీర విద్యావంతుడు

రెండు పళ్ల విభాగంలో పల్నాడు ఎడ్ల సత్తా

కారంపూడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక నూతన బస్టాండ్ సమీపంలో శనివారం రెండు పళ్ల విభాగంలో ఎడ్ల బండ లాగుడు పోటీలు జరిగాయి. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత 3,330 అడుగులతో ప్రథమస్థానం కైవసం చేసుకుంది. ముప్పాళ్ల మండలం, మాదలకు చెందిన పొన్నబోయిన భరత్ యాదవ్ ఎడ్లజత ద్వితీయ స్థానం, ప్రకాశం జిల్లా కంభం మండలం యర్రబాలేనికి చెందిన వెంకటగిరి హేమలత నాయుడు, బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన తేజశ్రీరెడ్డి సంయుక్త ఎడ్లజత తృతీయ స్థానంలో నిలిచాయి. నరసరావుపేటపేట మండలం దొండపాడుకు చెందిన యర్రం రాజశేఖర్, యశ్వంత్ ఎడ్లజత, అమరావతి మండలం జిడుగుకు చెందిన భూపతి శ్రీనివాసరావు, బెల్లంకొండ మండలం మాచాయపాలేనికి చెందిన గౌరు కార్తికేయ ఎడ్లజత, మాచవరం మండలం మల్లవోలుకు చెందిన ఘంటా రమ్యనాయుడు ఎడ్లజత తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి. కాపు సంఘ నేత సంగినేని బాలకృష్ణ బహుమతులు ప్రదానం చేశారు. సొసైటీ చైర్మన్ నాగారపు రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు శేషగిరిరావు, జక్కా నరసింహారావు, అమరయ్య, మాజీ ఎంపీపీ నాగుల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వీవీఐటీయూ విద్యార్థుల కొలువులు


ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో వర్సిటీ అధ్యాపకులు

పెదకాకాని, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీకి చెందిన 131 మంది విద్యార్థులు కియా, ఇన్ఫోసిస్‌లలో ఉద్యోగ నియామకాలు పొందారని వర్సిటీ ప్రొ చాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ శనివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ అకాడమీ (అపేట) ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ సంస్థ నిర్వహించిన మహిళా ఉద్యోగ మేళాలో ఇన్ఫోసిస్ సంస్థకు 69 మంది, నేషనల్ అప్రెంటిస్‌ప్ ప్రమోషన్ స్కీమ్ (న్యాప్స్)ద్వారా కియా సంస్థకు 62 మంది విద్యార్థులు ఉద్యోగ నియామకాలకు ఎంపికైనట్లు చెప్పారు. మెకానికల్, ఈసీఈ, ఈఈఈ ఇంజనీరింగ్ కోర్ బ్రాంచిలకు చెందిన విద్యార్థులు అత్యధికంగా 64 మంది నియామకాలు సాధించడం సంతోషకరమన్నారు. ఇన్ఫోసిస్‌లో రూ.3.6 లక్షల నుంచి రూ.9.5 లక్షలు, కియాలో శిక్షణా సమయంలో రూ.2.5 లక్షల వార్షిక వేతనం పొందారని తెలిపారు. నియామకాలు పొందిన విద్యార్థులను చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చాన్సలర్ కొడాలి రాంబాబు, రిజిస్ట్రార్ వై. మల్లికార్జునరెడ్డి. ప్లేస్మెంట్ డైరెక్టర్ ఎ. వెంకటేష్ అభినందించారు.

గింజ మొలకలో కాంతి కీలకపాత్ర

● ఆచార్య సౌరబ్ దత్త

ఏఎన్‌యూ నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గింజ మొలకలో వెలుతురు కీలక పాత్ర పోషిస్తుందని భోపాల్‌లోని ఐఐఎస్‌ఈఆర్ ఆచార్యులు సౌరబ్ దత్త పేర్కొన్నారు. ఏఎన్‌యూలో అటవీ, బోటనీ, మైక్రోబయాలజీ విభాగాలు సంయుక్తంగా ఫారెస్ట్ సర్క్యులర్ బయో ఎకానమీ అనే అంశంపై శనివారం ఏర్పాటు చేసిన ఒకరోజు అంతర్జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆచార్య సౌరబ్ దత్త విచ్చేసి, మాట్లాడారు. సీడ్ అభివృద్ధిలో బీబీఎక్స్ ప్రోటీన్ ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు. అతిథులు విజయవాడ ఇందిరా గ్రీన్ టెక్ సంస్థ సీఈవో బి.వెంకటేశ్వర్లు, మారా సాంకేతిక వర్సిటీ ఆచార్యులు లీ సేగ్ హువా, ఏపీ ఎస్‌ఆర్‌ఎం అధ్యాపకులు డాక్టర్ రంగబాసీయం, సదస్సు కన్వీనర్ ఆచార్య మల్లికార్జున, కార్యదర్శి ఆచార్య ఉమామహేశ్వరరావు ప్రసగించారు.

అనకాపల్లి కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

● సీపీఎస్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు పఠాన్ బాజీ

గుంటూరు సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అనకాపలిలోని 9వ వార్డు సచివాలయంలో వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీగా పని చేస్తున్న ఎం.నూకరాజు మృతికి కారణం అయిన మునిసిపల్ కమిషనర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పఠాన్ బాజీ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. అనకాపల్లి జోన్ కమిషనర్‌గా పని చేస్తున్న కె.చక్రవర్తి సచివాలయం ఉద్యోగుల పట్ల అత్యంత అమానవీయంగా ప్రవర్తించడం వల్లే నూకరాజు ఒత్తిడికి లోనయ్యి మృతి చెందారని ఆరోపించారు. గతంలో అదే కార్యాలయంలో పని చేస్తున్న మరో శానిటరీ అసిస్టెంట్ కూడా అదే పద్ధతిలో మృతి చెందారని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

5న అర్హత పరీక్ష

గుంటూరు(విద్య), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు డిసెంబరు 5న అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.మయూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని బీసీ స్టడీ సర్కిల్‌లో పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఉచిత శిక్షణకు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు గుంటూరు రాజాగారితోటలోని బీసీ స్టడీసర్కిల్(0863- 2358071)లో సంప్రదించాలన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	117, 124, 136
చికెన్ విత్ స్కిన్(కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	232.00

భక్తులు మెచ్చేలా ఆలయ అభివృద్ధి

● పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్


తులాభారం పూజ చేస్తున్న మంత్రి

తెనాలి అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వైకుంఠపురాన్ని భక్తులు మెచ్చేలా తీర్చిదిద్దుతామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో దాతల సహకారం ద్వారా రూ.72 లక్షలతో నిర్మించిన పొంగలి షెడ్లు, కేశ ఖండనశాలను శనివారం ఆయన ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన తులాభారం ప్రారంభించి పూజలు చేశారు. నిర్మాణానికి విరాళాలు అందించిన దాతలను సన్మానించారు. కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం, ఈవో అనుపమ, కౌన్సిలర్ దీవి అనిత, పాలక మండలి సభ్యులు, అర్చకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మార్కెట్ సెంటర్‌లోని సీతారామస్వామి ఆలయంలో దేవదాయ నిధులు రూ.92 లక్షలతో నిర్మించిన శ్రీ రామ సదన్‌ను మంత్రి ప్రారంభించారు. ఈవో అమర్‌నాథ్, అర్చకులు పాల్గొన్నారు.

కల్యాణ మండపాన్ని ప్రారంభించిన మంత్రి పెమ్మసాని


మండపం ప్రారంభిస్తున్న మంత్రి

కొల్లిపర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మండల పరిధిలోని కుంచవరంలో శ్రీవారాహి అమ్మవారి ఆలయ కల్యాణ మండపాన్ని శనివారం ప్రారంభించారు. అమ్మవారి దేవాలయాన్ని నిర్మించిన తన్నీరు శ్రీనివాసరావు దేవాలయం, కల్యాణ మండపం ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి చేస్తామని చెప్పడం సంతోషించతగ్గ విషయమని అభినందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వి.హరిబాబు, వంగా సాంబిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రామాల పర్యటన: ఎమ్మెల్యే ప్రవీణ్


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజల వద్దకు ప్రవీణ్ పేరిట నియోజకవర్గ పరిధిలో గ్రామాల పర్యటనకు సిద్ధమవు తున్నట్లు పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. ఈ మేరకు గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన కరపత్రాలను ఆవిష్కరించి, వివరాలు వెల్లడించారు. క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి వంద రోజులు.. 100 గ్రామాలకు వెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసామని చెప్పారు. ఆదివారం క్రోసూరు మండలం ఎర్రబాలెం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. అధికారులు, నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. టీడీపీ నాయకుడు వెన్నా సాంబశివారెడ్డి, అచ్చంపేట, అమరావతి మండలా టీడీపీ అధ్యక్షులు పాల్గొన్నారు.

పెరిగిన డైట్ చార్జీలు

సత్తెనపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన పథకం డైట్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని ఎంఈవో శ్రీనివాసరావు శనివారం తెలిపారు. విద్యార్థులకు మరింత నాణ్యతగా భోజనం అందించేందుకు ఈ నిర్ణయం తీసుకుందన్నారు. గతంలో ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5.45 చెల్లించగా ఇప్పుడు దానిని రూ.6.19కి పెంచిందన్నారు. గతంలో కంటే 74 పైసలు అదనమని వెల్లడించారు. ఆరు నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు గతంలో రూ.8.19 చెల్లించగా దీనిని రూ.9.29కి పెంచిందన్నారు. గతం కంటే రూ.1.15 ఎక్కువన్నారు. డైట్ చార్జీల పెంపుతో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం లభించడంతో పాటు మధ్యాహ్న భోజన కార్మికులకు సైతం ప్రయోజనం దక్కనుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

బాపట్ల వార్తలు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

● ఎస్పీ బి.ఉమామహేశ్వర్



ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్లు, పాతనేరస్తులు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. నేరనియంత్రణకు తీసుకునే చర్యలలో భాగంగా శనివారం జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్‌ల పరిధిలో రౌడీషీటర్‌లు, పాతనేరస్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరప్రవృత్తిని విడనాడి సత్‌ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అవసరమైతే పీడీయాక్ట్ అమలు చేయటానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రత పరిరక్షణ, నేరనియంత్రణకు తీసుకునే ముందస్తు చర్యలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తుల ప్రస్తుత జీవనవిధానం, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. పాతనేరస్తులు, రౌడీషీటర్‌ల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవటానికి వెనుకాడబోమని హెచ్చరించారు.

పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం తగదు : కమిషనర్

బాపట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం వహించరాదని, రోడ్లపై చెత్త పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని కమిషనర్ జి.రఘునాథరెడ్డి సూచించారు. పట్టణంలో శనివారం ఉదయం కమిషనర్ సూర్యలంక రోడ్డు, మెయిన్‌రోడ్డులో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. వ్యాపార దుకాణాల నుంచి సేకరించే కమర్షియల్ వ్యర్థాలను సమయానికి తీసుకెళ్ళేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సెక్రటరీలు, ఫీల్డ్‌సిబ్బందిని ఆదేశించారు. మూడో వార్డు రాజీవ్‌గాంధీకాలనీలో చెరువు పూడ్చే పని త్వరితగతిని పూర్తి చేయాలన్నారు. విశ్వబ్రాహ్మణకాలనీ, వివేకానందకాలనీలలో మున్సిపల్ పార్క్‌లను పరిశీలించారు. పార్క్ పక్కన ఖాళీ స్థలంలో పెరిగిన ముళ్ళచెట్లను తొలిగించి శుభ్రం చేయించారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, పురపాలక సంఘానికి సంబంధించిన అన్ని పనులను ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చేస్తామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణ పాల్గొన్నారు.

వ్యవసాయ విద్య ద్వారా విదేశాలలో ఉన్నతోద్యోగాలు

● గుల్బర్గా యూనివర్సిటీ వీసీ డాక్టర్ శశికాంత్ ఉడికేరి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శశికాంత్ ఉడికేరి

బాపట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాస్త్రంలో పట్టభద్రులైన వారు ప్రపంచంలో ఏ రంగంలోనైన ఉద్యోగావకాశాలను పొందవచ్చునని, విదేశాలలో ఉద్యోగాలను చేయాలనుకునే వారికి వ్యవసాయ శాస్త్రం విశాలమైన అవకాశాలను ఇస్తుందని కర్ణాటక రాష్ట్రానికి చెందిన గుల్బర్గా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ శశికాంత్ ఉడికేరి అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో జరుగుతున్న దీక్షారంభ్ -2025 ముగింపు కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయ విద్య కేవలం వ్యవసాయ సంబంధితమైనదిగా మాత్రమే కాకుండా గ్రామీణాభివృద్ధి, పర్యావరణం, వృక్షశాస్త్రం, వాతావరణ శాస్త్రం వంటి అనేక అనుబంధ అంశాలను కలిగి ఉన్న సమగ్ర విభాగమని అందువలన వ్యవసాయ విద్యార్థులు వివిధ అగ్ని, జల, వాయు పరిస్థితులను ప్రత్యక్షంగా అధ్యయనం చేయటం వలన మాత్రమే వ్యవసాయ విధానంపై సమగ్ర అవగాహన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనా రాణి, డాక్టర్ ఎం.శ్రీరేఖ, డాక్టర్ ఎం.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఆహారవిజ్ఞాన సాంకేతిక కళాశాలలో దీక్షారంభ్

బాపట్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో శనివారం దీక్షారంభ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల పూర్వవిద్యార్థి, నేషనల్ ఫుడ్ లేబరేటరి, ఫుడ్‌సెఫ్టి అండ్ స్టాండర్డ్స్ అథారటి ఆఫ్ ఇండియా ముంబాయిలో అనలిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ శ్రీకాంత్ సారంగం ఆన్‌లైన్‌లో ఇంట్రాక్షన్ అయ్యారు. ఫుడ్‌టెక్నాలజి రంగంలో ఉన్న వివిధ అవకాశాలు, నైపుణ్యాల ప్రాముఖ్యత, కేరీర్ మార్గదర్శకం వంటి అంశాలపై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్, డాక్టర్ సి.హెచ్.సోమేశ్వరరావు, డాక్టర్ దిలీప్‌సేను పాల్గొన్నారు.

సూర్యలంక బీచ్‌లో శుభ్రత కార్యక్రమం

బాపట్ల రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల డాక్టర్ ఎన్టీఆర్ కాలేజి ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజి బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు దీక్షారంభ్ కార్యక్రమం సందర్భంగా సూర్యలంకబీచ్‌ను సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బీచ్ శుభ్రత కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇ.గౌతమి మాట్లాడుతూ విద్యార్థులలో సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బీచ్‌లో ఉన్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలిగించి శుభ్రతపై ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచింగ్ అసిస్టెంట్ ఎంఎల్ లావణ్య, డాక్టర్ వై.దిలీప్‌సేన్, విద్యార్థులు పాల్గొన్నారు.



సూర్యలంక తీరంలో బీచ్‌ను శుభ్రం చేస్తున్న డాక్టర్ ఎన్టీఆర్ కాలేజి ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజి ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయంలో...

పిట్టలవానిపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీ చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ విజయశివకుమార్‌రెడ్డి దేవదాయశాఖ ఉద్యోగులతో కలిసి ఆలయంలో జరుగుతున్న పొంగళిశాల, ఆలయ పరిసరాలు, కల్యాణ మండపం తదితర ప్రదేశాలలో జరిగిన పరిశుభ్రత కార్యక్రమాలలో పాల్గొన్నారు. భక్తుల భోజనశాల కొరకు ఆయన పలు సూచనలు చేశారు. పలు పరికరాలను తాను అందజేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కలకోట చక్రధర్‌రెడ్డి, త్రిముఖ దేవాలయాలకు చెందిన కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి, చందోలు గ్రామ పంచాయతీ కార్యదర్శి బండ్లమూడి సుజాత, చందోలు ఎస్‌ఐ ఎం.వి.శివకుమార్, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారుల భారీన పడకుండా చర్యలు తీసుకోవాలి : ఆర్డీవో

బాపట్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : రైతులు దళారుల భారీనపడకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో పి.గ్లోరియా తెలిపారు. బాపట్ల తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ధాన్యం కొనుగోలుపై వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతిరైతు ధాన్యాన్ని ప్రభుత్వ ధరకు అమ్ముకునేవిధంగా చూడాలన్నారు. రైతుల వద్దకెళ్ళి ధాన్యం పరీక్షించి ప్రభుత్వం మిల్లర్‌ల ద్వారా కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. ఈ సమావేశంలో బాపట్ల,కర్లపాలెం, పిట్టలవానిపాలెం తహసీల్దార్‌లు షేక్.సలీమా, షాకీర్ పాషా, వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

బాపట్లరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం స్టూవర్టుపురం పెదగ్యాంగ్ సమీపంలో అక్రమంగా ఇసుక రవాణా జరుపుతున్న మూడు ట్రాక్టర్‌లను శనివారం వెదుళ్ళపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వెదుళ్ళపల్లి ఎస్‌ఐ భాగ్యరాజ్ మాట్లాడుతూ ముద్రబోయిన మాధవరావు, భవానీ శంకర్, బాలాజి అనే ముగ్గురు వ్యక్తులు ట్రాక్టర్‌లతో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేయటం జరిగిందన్నారు. వెదుళ్ళపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఎవరైన అక్రమంగా ఇసుక రవాణా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరకట్నం కోసం వేధిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి

● అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్
● మూడేళ్ళలో 655 వరకట్న వేధింపుల కేసుల నమోదు
● వేధింపులు తాళలేక ఏడుగురు, హత్యకు గురై 9 మంది మృతి



వరకట్న వేధింపుల నిరోధక చట్టం అమలు తీరుపై జిల్లా స్థాయి కమిటీతో సమావేశమైన కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ

బాపట్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : వరకట్నం కోసం వేధించిన, నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. వరకట్న వేధింపుల నిరోధక చట్టం అమలు తీరుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం శనివారం కలెక్టరేట్‌లో జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వరకట్న వేధింపులతో బాధితులైన వారికి తక్షణమే న్యాయం జరిగేలా అధికారులు పని చేయాలన్నారు. వరకట్నంతో అమాయకుల జీవితాలు నాశనమౌతుంటే అధికారులు మిన్నకుండరాదన్నారు. బాధ్యులను ఉపేక్షించరాదన్నారు. వివాహాల సమయంలో బహుమతుల పేరుతో నగదు, ఆస్తి వంటివి ఇస్తే అవి నేరంగా పరిగణించాలన్నారు. 2023 సంవత్సరంలో జిల్లాలో వరకట్న వేధింపులపై 240 కేసులు నమోదైనట్లు తెలిపారు. అందులో వరకట్న వేధింపులకు ముగ్గురు మృతి చెందగా ఐదురుగు హత్యకు గురయ్యారన్నారు. 2024 సంవత్సరంలో 214 కేసులు నమోదు కాగా వేధింపులకు ఇద్దరు మృతి చెందగా ఒకరు హత్యకు గురయ్యారన్నారు. 2025వ సంవత్సరంలో 201 కేసులు నమోదు కాగా ఇద్దరు హత్యకు గురయ్యారన్నారు. గడిచిన మూడేళ్లలో జిల్లా వ్యాప్తంగా వరకట్న వేధింపుల నిరోధకచట్టం కింద మొత్తంగా 655 కేసులు నమోదైనట్లు తెలిపారు. అందులో వేధింపులు తాళలేక ఏడుగురు మృతి చెందగా 9 మంది మహిళలు హత్యకు గురయ్యారన్నారు. వివాహమై 7 సంవత్సరాలలో మహిళలు మృతి చెందితే ఈ చట్టం పరిధిలోకి తీసుకురావాలని చట్టాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. చట్టంపై ప్రజలకు విస్తృతమైన ప్రచారం చేయాలని, అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐసీడీఎస్ పీడీ రాధామాధవి, కమిటీలోని అధికారులు పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మినీఅంగన్‌వాడీ కేంద్రాలు సాధారణ కేంద్రాలుగా మార్పు

మినీ అంగన్‌వాడీ కేంద్రాలను సాధారణ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల మిళితంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలకు మరిన్ని సేవలందించే క్రమంలో మినీ అంగన్‌వాడీ కేంద్రాలను సాధారణ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రీస్కూల్ విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారం అందించటానికి వీలుకలుగుతుందని తెలిపారు. ఆ మేరకు జిల్లాలో ఇప్పటి వరకు 16 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిని అప్‌గ్రేడ్ చేస్తున్నామన్నారు. జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆమోదించినట్లు తెలిపారు. ఆ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నామన్నారు. మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు గౌరవవేతనం రూ.7 వేలు ఇస్తుండగా మార్పు చేసిన తదుపరి రూ.11,500 గౌరవ వేతనంగా అందుకుంటారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి కేంద్రాలను మార్పు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మహిళా శిశుసంక్షేమశాఖ పీడీ రాధామాధవి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, డీఈవో పురుషోత్తం, బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల నూతన కార్యవర్గ ఎన్నిక



బి.అనీల్‌కుమార్ డి.నానీబాబు

పిట్టలవానిపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రోపాధ్యాయ సంఘం పిట్టలవానిపాలెం మండల శాఖ కార్యవర్గానికి జరిగిన ఎన్నికలలో పిట్టలవానిపాలెం మండలశాఖ అధ్యక్షుడిగా అల్లూరు హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు బి.అనీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా డి.నానీబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా ఈమని సాంబశివరావు, మహిళా కార్యదర్శిగా కె.రజనీ ఎన్నికయ్యారు. స్థానిక మండలపరిషత్ పాఠశాలలో శనివారం ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడివాడ అమర్‌నాథ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యవర్గ సమావేశంలో ఎన్నికల పరిశీలకుడిగా కర్లపాలెం మండల శాఖ అధ్యక్షుడు గూడారంకయ్య పాల్గొని ఈ ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ మాట్లాడుతూ సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత సాధించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన నేపథ్యంలో కేంద్రప్రభుత్వం విద్యాహక్కు చట్టంలో మార్పులు చేసి 2009కు ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలన్నారు. మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయులను యాప్‌ల భారం తగ్గించి బోధన సమయాన్ని పూర్తి స్థాయిలో విద్యార్థులకు కేటాయించే విధంగా విద్యాశాఖాధికారులు సమీక్ష చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్టీయూ కార్యవర్గ సభ్యులుగా గుమ్మడి కాంచనరావు, గాదె రమేష్‌బాబు, బత్తుల శ్రీనివాసరావు, కె.శివప్రసాద్, పి.రాజకుమారి, కె.శ్రీనివాసరావు, ఆర్.లక్ష్మీకుమారి, తాతా నారాయణరావు, ఎం.రాజ్యలక్ష్మీ తదితరులు సభ్యులుగా ఎన్నికయ్యారు.

లేబర్‌కోడ్స్‌కు వ్యతిరేకంగా నిరసన

బాపట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పాతబస్టాండ్ వద్ద కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్‌కోడ్స్‌కు వ్యతిరేకంగా శనివారం జీవో కాపీలను సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు తగలబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి సీహెచ్‌మజుందార్ నిరసనలో పాల్గొని మాట్లాడుతూ కార్మికులు మెడకు ఉరితాళ్ళుగా మారే లేబర్‌కోడ్స్‌ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని తెలిపారు. లేబర్‌కోడ్స్ వల్ల కార్మికుల హక్కులు హరించబడతాయని, పని గంటల పెంపు కార్మికుల ఆరోగ్యాలపై తీవ్రప్రభావం చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ బాపట్ల పట్టణ నాయకులు కె.శరత్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, శ్రీనివాసు పాల్గొన్నారు.

సామాజిక న్యాయపోరాట యోధుడు ములాయంసింగ్‌యాదవ్

బాపట్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : సామాజిక న్యాయపోరాట యోధుడు నేతాజి ములాయంసింగ్ యాదవ్ అని సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేదా శ్రీనివాసరావు అన్నారు. సమాజ్‌వాదిపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ములాయంసింగ్‌యాదవ్ జయంతిని బాపట్ల పార్టీ కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించారు. సీపీఐ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి తన్నీరు సింగరకొండ, గొర్ల ఏడుకొండలు, కాండ్రు శరత్‌కుమార్, కొమ్మనబోయిన ఫణేంద్ర, శాయిల శ్రీనివాసరావు, దర్శి భాస్కరరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీపథకం సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీటీసీ

కర్లపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ, రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు అన్నారు. కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామ పంచాయతీ ఆవరణలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంపై శనివారం జరిగిన ప్రత్యేక సభలో ఉపాధిమీ హామీ పథకం సద్వినియోగం చేసుకోవటం గ్రామప్రజలతోపాటు గ్రామానికి కలిగే ప్రయోజనాలు గురించి ఆయన వివరించారు.

అనుమతి లేని గృహాలకు నోటీసులు

రేపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పురపాలకసంఘ పరిధిలో అనుమతి లేని గృహాలను గుర్తిస్తున్నామని మున్సిపల్ శాఖ టౌన్ ప్లానింగ్ శాఖాధికారులు తెలుపుతున్నారు. పురపాలక సంఘంలో 28 వార్డులు ఉండగా వార్డుల వారీగా సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ ప్లాన్‌లు పొందని గృహాలు బీపీఎస్ స్కీమ్ ద్వారా అనుమతులు పొందవచ్చని అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 10లోపే బీపీఎస్ స్కీమ్ కింద అనుమతుల కోసం దరఖాస్తులు వచ్చాయని, పట్టణంలో సర్వే కొనసాగుతుందని బిల్డింగ్ ప్లాన్ లేని వారిని గుర్తించే పనిలో సిబ్బంది ఉన్నారని తెలుపుతున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రేపల్లె, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యం, గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండటం ద్వారా నేటియువత భవిష్యత్తును రూపుదిద్దుకుంటారని నగరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మాటూరి శ్రీరామ్‌ప్రసాద్ అన్నారు. నగరం పరిధిలోని అద్దంకివారిపాలెంలో ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం శనివారం కేర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మించటానికి కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో సచివాలయ సిబ్బంది, అద్దంకివారిపాలెం వీఆర్‌వో పోతురాజు, గ్రామస్థులు, నగరం ప్రొహిబిషనల్ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ మృతి

కర్లపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లమోతువారిపాలెంలో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ కె.ఏసుపాదం శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఏసుపాదం భౌతికకాయానికి మాడా సుబ్రహ్మణ్యం తదితరులు నివాళులర్పించారు.

అభివృద్ధికి దోహదపడుతున్న ఉపాధి నిధులు : ఎంపీడీవో



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

వేమూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ నిధులు గ్రామాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు దోహదపడుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పెద్దింటి రవికుమార్ అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి పనులు చేపట్టేందుకు ప్రజల ఆమోదం కోసం పోతుమర్రు జంపని, వేమూరు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. ఏపీవో సత్యకృష్ణ పర్యవేక్షణలో జరిగిన సభలకు హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ, గ్రామాలలో ప్రభుత్వ భవనాలతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలకు, వ్యవసాయానికి సంబంధించిన సౌకర్యాల కల్పనకు చేపట్టే పనులకు ఉపాధి నిధులను ఖర్చు చేసుకునే అవకాశం ఉందన్నారు. పోతుమర్రులో 23, జంపనిలో 52, వేమూరులో 42 పనులు చేపట్టేందుకు రైతులు, గ్రామస్థులు తమ ఆమోదాన్ని తెలపడంతో ఏకగ్రీవంగా ఆమోదాన్ని నివేదికలో పొందుపరిచారు. సభలలో సర్పంచ్‌లు లక్ష్మీతిరుపతమ్మ, పెదమరియమ్మ, కూచిపూడి షైనా, టెక్నీషియన్లు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, రైతులు, గ్రామస్థులు హాజరయ్యారు.

ఖైదీలు క్షణికావేశానికి లోనుకావొద్దు

● సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పీడీ వెన్నెల

రేపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఖైదీలు క్షణికావేశానికి లోనుకావద్దని, మీ వెనుకాల మీ కుటుంబాలు ఆధారపడి ఉంటాయని సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పీడీ వెన్నెల అన్నారు. స్థానిక సబ్‌జైల్లోని ఖైదీలకు పెట్టే ఆహార పదార్థాలను శనివారం తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఖైదీలకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చట్టాలపై ఖైదీలు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఇప్పుడు చేసిన తప్పులు మరెప్పుడు చేయకుండా సత్‌ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అనంతరం ఖైదీల గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవా దృక్పథంతోనే వైద్య సేవలు

● చైర్మన్ చిరుమామిళ్ళ కృష్ణయ్య

అమృతలూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు ప్రాంతం మాచర్లలో నిర్మించిన పరుచూరిమీనాక్షిసీతారామాంజనేయులు కంటి వైద్యశాలలో సేవా దృక్పథంతోనే వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యశాల చైర్మన్ చిరుమామిళ్ళ కృష్ణయ్య తెలిపారు. వైద్యశాల ప్రధాన దాత, ఎన్నారై మీనాక్షిసీతారామాంజనేయులు దంపతులు శనివారం స్వగ్రామం అమృతలూరు విచ్చేసిన సందర్భంగా వీరిని సత్కరించేందుకు కంటి వైద్యశాల చైర్మన్ కృష్ణయ్య, కమిటీ సభ్యులు అమృతలూరు విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో నిర్మించిన ఈ వైద్యశాలలో అనేక మంది పేదలకు ఉచితంగా నేత్ర పరీక్షలు జరపడంతోపాటు, చికిత్స కూడా అందిస్తున్నట్లు చెప్పారు. ఎన్నారై దంపతులు మాట్లాడుతూ కంటి సమస్యలతో ఎవరూ బాధపడకూడదన్న సంకల్పంతోనే ఈ వైద్యశాల నిర్మాణం చేయడం జరిగిందన్నారు. అనంతరం ఎన్నారై దంపతులను శాలువా, మొమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో వైద్యశాల కమిటీ సభ్యులు వాసు, మాధవరావు, నాగేశ్వరరావు, రామారావు, ప్రసాదరావు, గ్రామస్తులు ,విశ్రాంత ఉపాధ్యాయుడు వెలువోలు మదనమోహనరావు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు క్రొత్తపల్లి రవీంద్రబాబును మీనాక్షిసీతారామాంజనేయులు దంపతులు దుశ్శాలువాతో సత్కరించారు.



ఎన్నారై మీనాక్షి సీతారామాంజనేయుల దంపతులను సత్కరిస్తున్న కంటి వైద్యశాల చైర్మన్ కృష్ణయ్య తదితరులు

రామమందిర నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

అమృతలూరులో సీతారామమందిర నిర్మాణానికి ఎన్నారై పరుచూరి మీనాక్షి సీతారామాంజనేయులు దంపతులు రూ.5 లక్షల విరాళాన్ని మాచర్ల కంటి వైద్యశాల చైర్మన్ చిరుమామిళ్ళ కృష్ణయ్య చేతుల మీదగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు క్రొత్తపల్లి రవీంద్రబాబు, క్రొత్తపల్లి సంగమేశ్వరరావులకు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య

వేమూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య అందించడం జరుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి తెలిపారు. ఈసీసీఈ డే కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని చావలి ఐదు అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను కేంద్రాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.



శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయంలో నూతన గ్రానైట్ పద్మపీఠం గురించి అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

నూతన గ్రానైట్ పద్మపీఠం అందజేయటం అదృష్టం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పిట్టలవానిపాలెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) :మండలంలోని శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న నూతన గ్రానైట్ పద్మపీఠం తయారు గురించి, పంచలోహ సింహాల తయారి విధానం గురించి శనివారం త్రిముఖ దేవాలయాలకు చెందిన కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తిని అడిగి తెలుసుకున్నారు. నూతన గ్రానైట్ పద్మపీఠం, పంచలోహ సింహాలు అందించే అవకాశం రావటం తన అదృష్టమని ఎమ్మెల్యే వేగేశన తెలిపారు. శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయానికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని చెప్పారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మ ఆలయానికి విరాళం ప్రకటించటంపై దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్ కలకోట చక్రధర్‌రెడ్డి, సహచర కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, కార్యనిర్వాహకులు, ఆలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

చందోలు గ్రామపంచాయతీ పరిధిలోని జుల్హా వీధికి చెందిన బాజిబేగ్‌కు సంబంధించిన పూరిల్లు ఇటీవల అగ్నిప్రమాదానికి గురైంది. ఈ విషయం తెలుసుకున్న బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ కూటమినాయకులతో కలిసి శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తనవంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిట్టలవానిపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మంరాజు వెంకటపతిరాజు, కూటమినాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మిమోసపోవద్దు

● కలెక్టర్ వినోద్‌కుమార్



ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

చెరుకుపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ధాన్యానికి గిట్టుబాటు ధర కలిపిస్తోందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. చెరుకుపల్లి మండలం గూడవల్లిలో ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతుసేవాకేంద్రం సిబ్బందిని ధాన్యం కొనుగోలు విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన రైతులతో మాట్లాడుతూ ధాన్యంలో తేమశాతం 17 శాతం వరకు ఉండవచ్చని, అంతకంటే ఎక్కువ ఉంటే ధాన్యాన్ని బాగా ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆరబెట్టుకోవడానికి తగిన టార్పాలిన్ పట్టాలను ఏర్పాటు చేయాలని మండల వ్యవసాయాధికారిని ఆదేశించారు. అలాగే అవసరమైన గోనెసంచులను కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఒక్కరైతుకు 25 ఎకరాల వరకు ఉండవచ్చని ఎకరానికి 24 క్వింటాళ్ళ చొప్పున ధాన్యం అమ్ముకునే అవకాశం ఉందని చెప్పారు. అలాగే ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో వారి నగదు వారి అకౌంట్‌లలో జమవుతాయని తెలిపారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి రోషన్ జమీర్‌బాషా, పౌరసరఫరాల మేనేజర్ కే.శివపార్వతి, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో షేక్ మహబూబ్‌సుభాని, మండల వ్యవసాయాధికారి ఎండీ ఫారూక్, రేపల్లె మార్కెట్ యార్డు డైరెక్టర్ గోగినేని సురేష్‌కుమార్, గూడవల్లి పీఏసీఎస్ చైర్మన్ ఆలపాటి నరేంద్రబాబు ఉన్నారు.



రహదారులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పథంలో పల్లెలు

● అనగాని శివప్రసాద్

రేపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రణాళికలు రూపుదిద్దుకుని వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన రహదారులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులను తొలగిస్తామని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన నగరంలోని పలుప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులను గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురిచేసిందని, శంకుస్థాపన చేసిన రోడ్లకే మరోసారి శంకుస్థాపన చేశారే తప్పా ఐదేళ్ళలో తట్టెడు మట్టి బొచ్చెడు సిమెంట్ కూడా వేయలేదని ఆయన విమర్శించారు. నగరం ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి ఎస్టీకాలనీ వరకు అలాగే నగరం కాపులపాలెం వెళ్ళే సీసీ రోడ్డు నిర్మాణానికి, నగరం గ్రామంలో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ.కోటి నిధులతో శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ రోడ్లను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మోర్ల సుబ్బారావు, లుక్కా గుడారంకయ్య, ఉప్పాల చెన్నకేశవులు, మాన్యం నాగమణి, ఉదయ్, చింతారావు, వాకా శ్రీకాంత్, కొలసాని రాము, మండల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● నిజాంపట్నం(రేపల్లె), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధి కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. నిజాంపట్నం మండలం అడవులదీవి గ్రామంలో డ్రైనేజీ కాల్వ నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ప్రజ్ఞం గ్రామంలో ఓవర్‌హెడ్‌వాటర్‌ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.1.50 లక్షల నిధులతో ఓవర్ హెడ్ ట్యాంక్‌లు, డ్రెయినేజీల అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. రహదారుల అభివృద్ధితోపాటు తాగునీరు, డ్రైనేజీని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వ పాలనలో గ్రామాల అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శొంఠి శ్రీనివాసరావు, మేకా రాజేష్ కన్నా, కూచిపూడి మోహన్‌రావు, కొలసాని రాము తదితరులు పాల్గొన్నారు.